క్లుప్తంగా

వేగం కన్నా ప్రాణం మిన్న



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కళాధర్

వీరఘట్టం: వాహనదారులు గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎస్సై జీ కళాధర్ సూచించారు. సీఎస్‌పీ రోడ్డులో యు.వెంకమ్మపేట వద్ద గురువారం రోడ్డు భద్రత నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవర్లు సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. వేగం కన్నా ప్రాణం మిన్న అనే విషయాన్ని ప్రతీ డ్రైవరూ గుర్తించుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖాధికారి సర్వేశ్వరరావు

సీతంపేట: మల్లి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, సీవోఈ కళాశాల విద్యార్థులకు గురువారం పాలకొండ అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. అగ్నిమాపకశాఖాధికారి జామి సర్వేశ్వరరావు ప్రమాదాల్లో గాయపడిన వారిని సురక్షిత ప్రదేశాలకు ఎలా తరలించాలి, ఊపిరితిత్తుల్లో చేరిన విషవాయువులు, నీరును ఎలా బయటకు పంపించాలో డెమో ద్వారా వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ధర్మాన శ్రీరామమూర్తి, రోణంకి వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఆరోగ్య సర్వే

భామిని: ప్రతీ ఇంటి సభ్యుల ఆరోగ్య పరిస్థితి గుర్తింపుకు చేపడుతున్న ఎన్‌సీడీసీడీ–3.0 ప్రోగ్రాం కచ్చితంగా పూర్తి చేయాలని భామిని వైద్యాధికారి డాక్టర్ పసుపులేటి సోయల్, సీహెచ్ఓ భాస్కరరావు సూచించారు. మండలంలోని వడ్డంగి వెల్‌నెస్ సెంటర్ పరిధిలో జరుగుతున్న ఇంటింట వైద్య పరీక్షలను గురువారం వారు పరిశీలించారు. మూడో విడత చేస్తున్న వైద్య పరీక్షలలో బీపీ, సుగర్‌తో పాటు క్యాన్సర్, లెప్రసీ, శరీరంపై మచ్చలు వంటి వాటిని కూడా గుర్తించాలన్నారు. గుర్తించిన అంశాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. ఏఎన్ఎం జీవిత సాహూ, వైద్య సిబ్బంది ఉన్నారు.

వైభవంగా తులసీ బృందావన పూజలు



పూజల్లో నిమగ్నమైన భక్తులు

పాలకొండ రూరల్: స్థానిక నక్కలపేటలో కొలువుతీరిన శ్రీలలితా త్రిపురసుందరి సహిత మృత్యుంజయ మరకత లింగేశ్వర ఆలయంలో కార్తీక వేడుకలు సాంప్రదాయబద్ధంగా కొనసాగుతున్నాయి. గురువారం అర్చకులు పి.శరత్ బాబు నేతృత్వంలో వైభవంగా తులసీ బృందావన పూజలు చేపట్టారు. తొలుత మహా శివునికి అభిషేకాలు, షోడోపచార పూజాధి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తులసి కోట వద్ద భక్తులు ప్రదక్షిణలు, సామూహిక వ్రతాలు చేశారు. అఖండ సౌభాగ్యం, కుటుంబ సంక్షేమం, వంశాభివృద్ధి కోరి అమ్మవారికి పాలు, చెరకు రసాలు సమర్పించి మొక్కులు చెలిచారు.

గవర్నర్ దృష్టికి విద్యార్థుల మృతి అంశం

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం, సీతంపేట, పాడేరు ఐటీడీఏల పరిధిలో జరుగుతున్న గిరిజన విద్యార్థుల మరణాల అంశాన్ని రాష్ట్ర గవర్నర్, జాతీయ మానవ హక్కుల సంఘం, జాతీయ ఎస్టీ కమిషన్‌ల దృష్టికి తీసుకువెళ్లినట్లు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రతీ ఆశ్రమ పాఠశాలలో చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం చెల్లించేలా చొరవ తీసుకోవాలని కోరామన్నారు.



పాలకొండ రూరల్: జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల పోస్టర్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నేటి బాలలే.. రేపటి నవభారత నిర్మాతలు!



భామిని: బత్తిలి జెడ్పీ హెచ్ స్కూల్‌లో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు



వీరఘట్టం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, పక్కనే కూర్చొని ఉన్న విద్యార్థులు



వీరఘట్టం: దశుమంతపురం పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు



జియ్యమ్మవలస: బిత్రపాడు ఎంపీయూపీ పాఠశాలలో బాలల దినోత్సవంలో విద్యార్థులు, సిబ్బంది



గుమ్మలక్ష్మీపురం: కురుపాం జెడ్పీహెచ్ఎస్‌లో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



వీరఘట్టం: కంబరవలస ఉన్నత పాఠశాలలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

భారత ప్రప్రథమ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం పురస్కరించుకుని, బాలల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు, గ్రంథాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది అంతా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. నేటి బాలలే రేపటి పౌరులు, నవభారత నిర్మాతలని, వారి బంగారు భవిష్యత్ కోసం మనమంతా కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. మనం వేసే ప్రతీ అడుగు పిల్లలకు మార్గదర్శకం కావాలని, మనం చేసే ప్రతీ పని వారిని చక్కని సమాజం వైపు నడిపించాలన్నారు. పలువురు చిన్నారులు చాచాజీ వేషధారణల్లో కనిపించి, కనువిందు చేశారు. –పాలకొండ, కురుపాం నెట్‌వర్క్

గ్రంథాలయాల్లోనే ప్రపంచ విజ్ఞానం



సీతంపేట: నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఈవోపీఆర్డీ సత్యం



గరుగుబిల్లి: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. లైబ్రేరియన్ డి.సుకన్య మాట్లాడుతూ ప్రపంచ విజ్ఞానం గ్రంథాలయాల్లో పుస్తకాల రూపంలో ఇమిడి ఉంటుందని, పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని సొంత చేసుకోవచ్చని తెలిపారు. ప్రతిఒక్కరూ గ్రంథాలయానికి విచ్చేసి, అందులోని పుస్తకాలను బాగా చదువుకుని విజ్ఞానవంతులుగా వెలుగొందాలన్నారు.

ఘనంగా గ్రంథాలయ దినోత్సవం

సీతంపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈవోపీఆర్డీ కె.సత్యం, ఉత్తరాంధ్ర ఎస్సీ, ఎస్టీ ఫోరం కన్వీనర్ భరత్ భూషణ్, లైబ్రేరియన్ బబ్బురు గణేష్, తదితరులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

గరుగుబిల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతిఒక్కరూ గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంఘ అధ్యక్షుడు టి.శివకేశవరావు కోరారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ ఇందుమతి, హెచ్ఎం పాత్రుడు, జట్టు ట్రస్టీ పారినాయుడు పాల్గొన్నారు.

108 సిబ్బంది సమ్మెబాట



పాలకొండ రూరల్: సమస్యలు వివరిస్తున్న 108 సిబ్బంది

పాలకొండ రూరల్: ఆపద సమయంలో తామున్నామంటూ భరోసా కల్పించే 108 సిబ్బంది నేడు ఇబ్బందులు పడుతున్నారని 108 ఉద్యోగుల సంఘం ప్రతినిధులు గణపతి, నాని, తదితరులు వాపోయారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. పలుమార్లు సమస్యలు విన్నవించిన సానుకూల సమాధానం లేకపోవటంతో గురువారం నల్ల బాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం తమను వైద్య ఆరోగ్యశాఖ శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, తమకు రావాల్సిన జీత భత్యాలు, ఇంక్రిమెంట్లు తదితర లావాదేవీలను సరిచేయాలని, 108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని, 8 గంటల పని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఈ నెల 25 నుంచి సమ్మెబాట పడతామని స్పష్టం చేశారు.

సీతంపేట: 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘ నాయకులు రవికుమార్, తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నిరసన చేపట్టారు. 108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించి ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల వలే 3 షిఫ్టల విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకు ఈనెల 25 నుంచి సమ్మెబాట పట్టనున్నట్లు చెప్పారు.

పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

సీతంపేట: స్థానిక వైటీసీలో గురువారం గ్రామపంచాయతీల అభివృద్ధిపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ కె.సత్యం మాట్లాడుతూ గ్రామాల్లో మౌలికవసతుల కల్పన, ప్రతిపాదనలు ఎలా తయారు చేయాలి, నిధులు వినియోగం, తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, వైస్ ఎంపీపీ కుండంగి సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

- భామిని: గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా నిధులు కేటాయించాలని ఎంపీడీఓ గుండేలా చంద్రరావు అన్నారు. భామిని మండల పరిషత్‌లో గురువారం నిర్వహించిన జీపీడీపీ శిక్షణలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన కల్పించారు. పంచాయతీలకు వచ్చిన నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో ఖర్చుచేయాలని సూచించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.
- పాలకొండ రూరల్: మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం సర్పంచ్‌లు, ఎంపీపీ, ఎంపీటీసీలు, జెడ్పీటీసీకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ అందించారు. 2024–25 ఏడాదికి సబంధించి ప్రభుత్వం విడుదల చేసే నిధుల వినియోగంపై ఎంపీడీఓ ఎం.రంగారావు అవగాహన కల్పించారు. ఎంపీపీ బొమ్మాళి భాను మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులను ప్రజాభిప్రాయం మేరకు శాశ్వత ప్రయోజనాలు అందించే పనులకు ఖర్చు చేయాలన్నారు.



భామిని: మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రరావు



సీతంపేట: మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ సత్యం

నేత్ర శస్త్రచికిత్సకు పయనం



విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రికి బయలుదేరిన రోగులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నేత్ర శస్త్రచికిత్సకు ఎంపికైన 30 మందిని విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి గురువారం ప్రత్యేక బస్సులో తరలించారు. కలెక్టర్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ చైర్మన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా కంటి వెలుగు నేత్ర వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, కొయ్యకండ, అంతర కుసుమం వంటి కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా ఆపరేషన్‌లు చేయనున్నామని అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన వారికి ఉచితంగా శస్త్రచికిత్స చేయడంతో పాటు రవాణా, భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఆపరేషన్ తర్వాత ఇంటికి వెళ్లిన వారికి ఫాలోఅప్ ట్రీట్‌మెంట్ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో నేత్ర వైద్య సహాయకులు సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

వితరణ

కొమరాడ: మండలంలోని మాదలింగి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వరుణ్ మారుతి సంస్థ జనరల్ మేనేజర్ పోరంకి సత్యప్రసాదరాజు దంపతులు గురువారం స్టీల్ ప్లేట్లు వితరణ చేశారు. తమ 25వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారు విద్యార్థుల భోజనానికి ఉపయోగపడే ప్లేట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తుమరాడ కళావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరాఫరాకు అంతరాయం

పాలకొండ: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఈఈ టీజీకే మూర్తి తెలిపారు. 11కేవీ వీరఘట్టం లైన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు సరఫరా నిలివేయనున్నట్లు పేర్కొన్నారు. యరకరాపురం గ్రామం వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

భామినిలో..

భామిని: మండలంలోని లివిరి నుంచి కొరమ వరకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ లైన్ కొరమ ఫీడర్‌లో చెట్లకొమ్మల తొలగింపు కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి బిర్సాముండా జయంత్యుత్సవాలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఆదివాసీ యోధుడు బిర్సాముండా జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలని గిరిజన సంఘాల నాయకులు గోవిందరావు, రామారావులు కోరారు. కురుపాం మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. అనంతరం సమీప గ్రామాలైన ధర్మలక్ష్మీపురం, జుంబిరి, మామిడిమానుగూడ, జరడ తదితర గ్రామాలకు వెళ్లి, కరపత్రాలు పంపిణీ చేశారు. గిరిజనుల హక్కుల కోసం పోరాడిన మహోన్నతమైన వ్యక్తి బిర్సాముండా అని, ఆయన జయంతిని ఓ పండుగలా నిర్వహించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. నీలకంఠాపురంలో శుక్రవారం నుంచి జరిగే ఉత్సవాలకు అందరూ తరలిరావాలన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన



హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సెట్విజ్ సీఈవో బి.రామ్‌గోపాల్ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఏ విధంగా వాడితే ప్రమాదాల బారినపడకుండా ఉండొచ్చన్న విషయాన్ని తెలియజేశారు. అనంతరం సచివాలయం వద్ద నిర్వహించిన అవగాహన సదస్సులో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాణ్యమైన హెల్మెట్‌నే వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో యస్ సొసైటీ కార్యదర్శి ఎస్.కె.గౌష్, సచివాలయం కార్యదర్శి అవని, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2.30 లక్షలతో మినీ గోకులం నిర్మాణం



పనులు పరిశీలిస్తున్న ఏపీడీ శ్రీహరిరావు

వీరఘట్టం: మండలంలోని దశుమంతపురం గ్రామంలో మినీ గోకులం నిర్మాణ పనులను ఉపాధిహామీ పథకం ఏపీడీ జీ శ్రీహరిరావు గురువారం పరిశీలించారు. నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. రూ.2.30 లక్షల వ్యయంతో చేపడుతున్న ఈ పనులను పర్యవేక్షణ చేయాలని ఏపీఓ జి.సత్యంనాయుడుకు సూచించారు.

'అపార్' సమస్యలు పరిష్కరించాలి

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థుల వివరాల నమోదుకు సంబంధించి, పాఠశాలల్లో చేపడుతున్న అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదులో నెలకొంటున్న సమస్యలు పరిష్కరించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. పాఠశాల రికార్డుల్లో పేర్కొన్న విద్యార్థుల పేర్లు, పుట్టిన తేదీలకు వారి ఆధార్ కార్డుల్లోని పేర్లు, పుట్టిన తేదీల్లో నెలకొన్న స్వల్ప మార్పుల కారణంగా అపార్ నమోదులో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. వాటిని సరిచేసుకునేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆధార్ సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారని, పాఠశాలల్లోనే ఆధార్ సేవా కేంద్రాలు ఏర్పాటయ్యేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రైతు ప్రయోజనాల సాధనకు ఉద్యమం



మాట్లాడుతున్న అప్పలనాయుడు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్ర పరిధిలో సాగునీటి వనరుల అభివృద్ధికి సంబంధించి కూటమి ప్రభుత్వానికి చేతులు రావటం లేదని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీరును గురువారం ఆయన ఎండగట్టారు. తోటపల్లి ఆధునీకరణకు ప్రభుత్వం చేష్టలోడి చూస్తోందని మండిపడ్డారు. ఈ ప్రాంత రైతులకు అవసరమైన కాలువల పునరుద్ధరణ, జంపరకోట జలాశయం పూర్తిపై ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తాజా బడ్జెట్‌లో నిధులు కేటాయింపులపై ఒక్కమాట మాట్లాడకపోవటం విడ్డూరమన్నారు. బ్రిటీస్ కాలం నాటి ఈ కాలువ ద్వారా వచ్చే సాగునీటిపై ఐదు మండలాల రైతులు ఆధారపడుతున్నారన్నారు. రైతు ప్రయోజనాలు సాధించుకునేందుకు మరో ఉద్యమానికి కార్యాచరణ సిద్ధం చేయాలని నిర్ణయించామన్నారు. ఖరీఫ్ పనులు పూర్తయిన వెంటనే రైతులతో కలిసి పోరుబాట పడతామన్నారు. సమావేశంలో ఆ సంఘ నాయకులు గురుబిల్లి అప్పలనాయుడు, కిమిడి రామ్మూర్తినాయుడు, బలగ దుర్గారావు, పారినాయుడు, త్రిపురాంతకరావు, సన్యాసినాయుడు తదితరులున్నారు.

వైన్ షాపులను తరలించండి



మద్యం దుకాణం తరలించాలని ఆందోళన చేస్తున్న స్థానికులు

వీరఘట్టం: స్థానిక కొత్త బస్టాండ్‌లో ఆంజనేయ స్వామి గుడి ఎదురుగా ఏర్పాటు చేయనున్న వైన్ షాపును వేరొక చోటకు తరలించాలని పలువురు అయ్యప్ప భక్తులు, స్థానికులు గురువారం ఆందోళన చేశారు. ఎదురుగా గుడి కనిపిస్తున్నప్పటికీ ఆ విషయాన్ని పట్టించుకోకుండా భక్తుల మనోభావాలను దెబ్బతీస్తూ ఇలా వైన్ షాపు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ఎక్సైజ్‌శాఖ అధికారులను ప్రశ్నించారు. ఆంజనేయస్వామి గుడికి వచ్చే భక్తుల మనోభావాలు నొప్పించకుండా తక్షణమే ఈ వైన్ షాపును వేరొక చోటకు తరలించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

- ఏఎస్పీ దిలీప్ కిరణ్



మాట్లాడుతున్న ఏఎస్పీ దిలీప్‌కిరణ్

సీతంపేట: విద్యార్థి దశ నుంచే ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని అడిషనల్ ఎస్పీ (పరిపాలన) దిలీప్ కిరణ్ అన్నారు. స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సీఐడీ విభాగం ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ పీఓఏ చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి అంబేడ్కర్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏఎస్పీ మాట్లాడుతూ చట్టం గూర్చి తెలియకపోతే చట్టం ఉపేక్షించదని (ఇగ్నోరెన్స్ ఆఫ్ లా నో ఎక్స్‌క్యూజ్) అన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. విశాఖ సీఐడీ డీఎస్పీ ఎం.ఎస్.భూపాల్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాలకొండ ఎస్డీపీఓ రాంబాబు, తహసీల్దార్ అప్పలరాజు, ఎస్ఐ వై.అమన్నరావు, ఏటీడబ్ల్యూఓ మంగవేణి, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, సీఐడీ ఇన్‌స్పెక్టర్లు చలపతిరావు, వేణుగోపాల్, రుద్రశేఖర్, గిరిజన జేఏసీ నాయకులు బి.శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్వరరావు, కె.భాస్కరరావు, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి

వీరఘట్టం: నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని కోరుతూ వీరఘట్టం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కమిటీ కన్వీనర్ ఎస్.సింహాచలం మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వం స్మార్ట్ విద్యుత్ మీటరు విధానంతో ప్రజలను దోచుకోవాలని చూస్తోందన్నారు. వెంటనే ఈ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులను అడ్డుకోవాలని కోరారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సి.హెచ్.సత్యనారాయణకు అందజేశారు.

పాలకొండలో..

పాలకొండ: నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కమిటీ కన్వీనర్ దావాల రమణారావు, సభ్యులు దూసి దుర్గారావు, కాద రాము, మజ్జి వీరన్నాయుడు, కరణం చంద్రశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలు రద్దుచేయాలి

భామిని: సామాన్య ప్రజలపై పెను భారంగా మారిన విద్యుత్ ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ నీలాపు అప్పారావుకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక విధానం అమలు చేయాలి. నిత్యావసర సరుకుల ధరలు కట్టడి చేయాలని కోరారు. పార్టీ నాయకులు కొప్పర మిన్నారావు, గొర్లె జగన్నాయుకులు, కొండగొర్రి ధర్మారావు, బీ అప్పన్న, కార్యకర్తలున్నారు.

సీతంపేటలో..

సీతంపేట: నిత్యావసర సరుకుల ధరలు నియంత్రించాలని, నిరుద్యోగాన్ని నిర్మూలించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలియజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎ.భాస్కరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఉపతహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బి.అప్పారావు, పి.సాంబయ్య, జె.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ/గుమ్మలక్ష్మీపురం(కురుపాం)/జియ్యమ్మవలస: సీపీఎం ఇచ్చిన పిలుపు మేరకు ఆ పార్టీ నేతలు అన్ని మండలాల్లోని తహసీల్దారు కార్యాలయాల వద్ద గురువారం ధర్నా చేపట్టారు. నిత్యావసర సరుకుల ధరలతో పాటు ట్రూఅప్ చార్జీల పేరిట పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ప్రభుత్వ ఆస్తులను విక్రయించొద్దని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఆయా డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు.



కొమరాడ మండల సర్వేయరుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు



జియ్యమ్మవలస: వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు



వీరఘట్టం: వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు